లక్ష్మీనృసింహుడికి లక్ష పుష్పార్చన

లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూలై 2 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని లక్ష పుష్పార్చన పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. మంగళవారం ఉదయం స్వామి, అమ్మవార్లకు సహస్రనామ పఠనాలతో అర్చకులు, వేద పండితులు వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. స్వయంభూ ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో దివ్య మనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దారు. లక్ష పుష్పార్చన పూజలను పాంచరాత్రగమ శాస్త్రం ప్రకారం సుమారు రెండు గంటల పాటు కొనసాగించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నరసింహస్వామికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలోని కల్యాణ మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన చేపట్టి, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. స్వామి, అమ్మవార్ల శయనోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయం, క్యూ కాంప్లెక్స్, శివాలయం చెంతన గల క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించారు. హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. తమలపాకులతో అర్చించి లలితాపారాయణం చేశారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన వడపప్పు, బెల్లం, అరటి పండ్లను నైవేద్యంగా సమర్పించారు. సుమారు 9వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.19,21,613 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

పీఏసీఎస్ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న డీసీఓ పి.నాగమణి

గుండాల, జూలై 2 : మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో మంగళవారం ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించి రైతు భరోసాపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా డీసీఓ పి.నాగమణి మాట్లాడుతూ రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షం, వైస్ చైర్మన్ పురుగుల యాదలక్ష్మి, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడు ర్యాకల శ్రీనివాస్‌కు సన్మానం

ర్యాకల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భువనగిరి అర్బన్, జూలై 2 : డాక్టరేట్ పొందిన ర్యాకల శ్రీనివాస్‌ను పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం పాండు మాట్లాడుతూ శ్రీనివాస్ చేసిన సేవలకుగాను ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ యూనివర్సిటీ డాక్టరేట్ ఇవ్వడం సంతోషమకరమన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుబ్బూరు బీరు మల్లయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్ కుమార్, నాయకులు చింతల కిష్టయ్య, ఎడ్ల సత్తిరెడ్డి, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నీల ఓం ప్రకాశ్ గౌడ్, పాండు, రమేశ్, మల్లయ్య, సుధాకర్, ఏసు, వీరేశం, శంకర్, నాగేశ్, చిరంజీవి, సురేశ్, అశోక్, మహేశ్, జహంగీర్ పాల్గొన్నారు.

ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి

- బీఆర్ఎస్‌వై నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వై నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్

మోటకొండూరు, జూలై 2 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్‌వై ఆలేరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జివిలికపల్లి వెంకటేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉద్యోగ నియామకాలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కిందని ఆరోపించారు. లక్ష ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి ఇంతవరకు నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నదన్నారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించి, వెంటనే మెగా డీఎస్సీ వేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వై నాయకులు బొట్ల మహేశ్, కొంపల్లి నర్సింహ, వంగపల్లి నరేశ్ పాల్గొన్నారు.

'స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలి'

తాసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

ఆలేరు రూరల్, జూలై 2 : స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు తాసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఎంఎస్‌పీ లోపభూయిష్టంగా ఉన్నదని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని అన్నారు. స్వామినాథన్ సిఫారసుల ప్రకారం ఉత్పత్తి ధరకు అదనంగా 50శాతం కలిపి ధర నిర్ణయించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సుదగాని సత్యరాజయ్య, పిక్క గణేశ్, దూపటి వెంకటేశ్ పాల్గొన్నారు.

'ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న సీఆర్‌పీఎఫ్ఐ నాయకులు

ఆలేరు రూరల్, జూలై 2 : అధిక ఫీజులు వసూలు చేస్తూ పాఠ్య పుస్తకాలను విక్రయిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కన్జూమర్ ప్రొటెక్షన్ ఫోరమ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంఈఓ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించకపోతే ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పులిపలుపుల మహేశ్, అశోక్‌నాయక్, సిద్దులు, ఉపేందర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రైతు భరోసా

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

తుర్కపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

తుర్కపల్లి, జూలై 2 : అర్హులైన రైతులందరికీ రైతు భరోసా అందిస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో రైతు భరోసాపై సోమవారం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. బడా భూస్వాములు, రియల్టర్లకు రైతు భరోసా అందించడంతో ప్రజాధనం వృథా అవుతుందని, అర్హులైన పేద రైతులకే అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. పదెకరాల రైతులకు పెట్టుబడి సాయం అందించాలని, ధాన్యానికి రూ.5వందల బోనస్ వెంటనే ఇవ్వాలని అన్నారు. అనంతరం పీఏసీఎస్ ఆధ్వర్యంలో రూ.25లక్షలతో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వ విప్ ఐలయ్య శంకుస్థాపన చేశారు. పీహెచ్ఎస్‌లో వెయిటింగ్ హాల్, వేల్పుపల్లిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్, జగ్యాతండా, గంధమల్లలో సీసీ రోడ్లు, వాసాలమర్రిలో మల్టీపర్పస్ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా సుశీలారవీందర్, పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, ఏడీఏ పద్మావతి, డీసీసీబీ భువనగిరి బ్యాంక్ మేనేజర్ శిరీష, తాసీల్దార్ దేశియా, ఎంపీడీఓ ఝాన్సీ లక్ష్మీబాయి, ఏఓ దుర్గేశ్వరి, ఎంపీటీసీలు వనజ, కర్ణాకర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, శంకర్ నాయక్, నర్సింహులు పాల్గొన్నారు.

పేదలందరికీ అందుబాటులో ఆరోగ్య సేవలు

బొమ్మలరామారం : పేదలందరికీ అందుబాటులో ఆరోగ్య సేవలు లభించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలోని రాంలింగంపల్లి గ్రామంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామ ప్రజలకు వైద్య సేవలు త్వరగా, నాణ్యంగా అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అర్హులందరికీ రుణమాఫీ, రైతు బరోసా అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్ రావు, మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, ఎంపీటీసీ ఎర్వ హేమంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యంజాల కళ పాల్గొన్నారు.

మోత్కూరు గురుకులంలో విచారణ

- నమస్తే తెలంగాణ కథనానికి స్పందన
- విచారణకు ఆదేశించిన కలెక్టర్

పాఠశాలలో విచారణ చేపడుతున్న ఆర్‌సీఓ రజనీ

మోత్కూరు, జూలై 2 : మున్సిపాలిటీ కేంద్రంలోని ఎస్సీ బాలుర గురుకుల విద్యాలయంలో మెనూ, వసతులపై కలెక్టర్ హనుమంతు కె.జెండగే విచారణకు ఆదేశించారు. 'మెనూ పాటించని గురుకులం' పేరుతో నమస్తే తెలంగాణలో మంగళవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారు. దాంతో ఆర్‌సీఓ రజనీ పాఠశాలను సందర్శించారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. ఆర్‌సీఓ నిర్లక్ష్యం వల్లే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు బుర్ర అనిల్, మందుల సురేశ్, ఉప్పల శాంతికుమార్ ఆరోపించారు. ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు పెడుతున్నా పర్యవేక్షణ చేయని ఆర్‌సీఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పప్పు సరిగా రుబ్బకుండా, బియ్యం శుభ్రం చేయకుండా వంట చేసిన వారిని మందలించినట్లు ఆర్‌సీఓ తెలిపారు. రెండ్రోజులకోసారి నాణ్యమైన కూరగాయలు సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పాఠశాల నిర్వహణపై నిత్యం పర్యవేక్షిస్తామని, మరో 20 రోజుల్లో కొత్త ప్రిన్సిపాల్ రానున్నారని తెలిపారు. పాఠశాల నిర్వహణపై, నిర్లక్ష్యం ప్రదర్శించిన బాధ్యులపై కలెక్టర్‌కు, డీఎస్‌డీఓకు నివేదిక పంపనున్నట్లు చెప్పారు. ఆమె వెంట అడ్డగూడూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రూప ఉన్నారు.

ధరణి దరఖాస్తుల్లో తప్పులుండొద్దు

- అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్

యాదగిరిగుట్ట, జూలై 2 : ధరణి దరఖాస్తుల్లో తప్పులుండొద్దని, ప్రతి ఒక్కటీ క్షణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్ అన్నారు. తాసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, పెండింగ్‌లో ధరణి దరఖాస్తులను అడిగి తెలుసుకున్నారు. 900 దరఖాస్తులకు 400 మాత్రమే పూర్తి చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తాసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ నర్సింహారావు ఉన్నారు.

తెలంగాణ గ్రంథాలయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మత్స్యగిరి

మోత్కూరు, జూలై 2 : తెలంగాణ గ్రంథాలయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మోత్కూరుకు చెందిన కోమటి మత్స్యగిరి నియమితులయ్యారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముదుగంటి సుధాకర్‌రెడ్డి తనను నియామకం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. మోత్కూరు శాఖా గ్రంథాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా, జిల్లా డైరెక్టర్‌గా గ్రంథాలయ వ్యవస్థ బలోపేతం కోసం చేస్తున్న కృషిని గుర్తించి తనకు అవకాశం కల్పించారన్నారు. మోత్కూరు శాఖా గ్రంథాలయంలో 13వేల పుస్తకాలను సేకరించి ఆదర్శంగా నిలిచినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నూనెగూడెం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి : సీపీఎం

గుండాల, జూలై 2 : మండలంలోని నూనెగూడెం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులతో కలిసి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూనెగూడెం గ్రామానికి గతంలో బస్సు సౌకర్యం ఉన్నదని, కరోనా నేపథ్యంలో నిలిపివేసిన బస్సు నేటికీ పునరుద్ధరణకు నోచుకోలేదని అన్నారు. నూనెగూడెం గ్రామస్తులు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే గుండాల, సీతారాంపురం స్టేజీ వరకు నడిచి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తూనం సైదులు, నర్సయ్య, అనసూర్య, రమేశ్, యాదిరెడ్డి, అంజిరెడ్డి, రామచంద్రయ్య, రాంరెడ్డి, నాగరాజు, యాదగిరి పాల్గొన్నారు.

నిరుపేద చేనేత కార్మికులకు ఆర్థిక సాయం

చేనేత కార్మికులకు ఆర్థిక సాయం అందజేస్తున్న టీఆర్ యువసేన నాయకులు

భూదాన్ పోచంపల్లి, జూలై 2 : పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్ జన్మదినం సందర్భంగా టీఆర్ యువసేన ఆధ్వర్యంలో ఐదుగురు నిరుపేద చేనేత కార్మికులకు ఒక సంవత్సరం పాటు చేనేత పొదుపు పథకం మొత్తం 50వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు చింతకింది రమేశ్, పాలాది యాదగిరి మాట్లాడుతూ రమేశ్ మూడు సంవత్సరాలుగా చేనేత కార్మికులకు ఆర్థిక సాయం అందజేస్తున్నారన్నారు. టీఆర్ యువసేన ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. పేదలను ఆదుకోవడంలో సంతృప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ముస్కూరి నర్సింహ, మంగళపల్లి రాజారమేశ్, పాండు, పురుషోత్తం, లక్ష్మణ్, హనుమంతు, రమేశ్, శశికళ, టీఆర్ యువసేన ప్రతినిధులు ప్రవీణ్, నర్సింహ, మహేందర్, దేవేందర్, భాను పాల్గొన్నారు.

రైతులు ఆర్థిక ప్రగతి సాధించాలి : బాలనర్సింహ

సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ బాలనర్సింహ

బొమ్మలరామారం, జూలై 2 : రైతులు సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించి ఆర్థిక ప్రగతి సాధించాలని పీఏసీఎస్ చైర్మన్ గూడె బాలనర్సింహ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా రైతుబంధు అమలుపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్లు మర్రి రమాదేవి, కొండోజు ఆంజనేయులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి : ఐద్వా

ప్రభుత్వ దవాఖానను సందర్శించిన ఐద్వా నాయకులు

చౌటుప్పల్, జూలై 2 : ప్రభుత్వ దవాఖానల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి అన్నారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ దవాఖానను సందర్శించారు. ఈ సందర్భంగా రోగుల సమస్యలు, అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు బత్తుల జయమ్మ, దొడ్ల ఆండాలు, చింతకింది శారద, పంతంగి శోభారాణి, సురేఖ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

భువనగిరి అర్బన్, జూలై 2 : ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మాట తప్పారని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నరేంద్ర మోదీ నిరుద్యోగులను, విద్యార్థులను మోసగించినందుకే కేంద్రంలో మెజార్టీ లేని ప్రభుత్వం వచ్చిందన్నారు. జడ్పీ సమావేశానికి హాజరైన తీన్మార్ మల్లన్నను అడ్డుకోవడం సరికాదని, బీజేవైఎం నాయకులు కేంద్ర మంత్రులను అడ్డుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూర వెంకటేశ్, నరేశ్, అవేస్ చిస్తీ, ప్రదీప్, నర్సింహ, వెంకటేశ్, గంగాధర్, రఘుబాబు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

చౌటుప్పల్, జూలై 2 : పార్లమెంట్‌లో హిందువులను కించపరిచేలా వ్యాఖ్యానించారని బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ వద్ద మంగళవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ హిందువులు హింసను ప్రోత్సహిస్తున్నారని, విద్వేషాలను రెచ్చగొడుతున్నారని రాహుల్ మాట్లాడడం సరికాదన్నారు. దేశ ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమనగోని శంకర్, దూడల భిక్షంగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, మల్లేశ్, అశోక్, శ్రీధర్‌బాబు, సురేందర్‌రెడ్డి, భిక్షమాచారి, వెంకటేశం గౌడ్, సత్యం, చిరంజీవి, భాస్కర్ పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

తన పదవీ కాలం పూర్తవుతున్న సందర్భంగా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను జడ్పీ వైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న సందీప్‌రెడ్డి

రైతుల అభిప్రాయం మేరకే పెట్టుబడి సాయం

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్
- మోత్కూరులో రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, జూలై 2 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసాను రైతుల అభిప్రాయం మేరకే ఇవ్వనుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మోత్కూరులో రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించి రైతు భరోసాపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సన్న, చిన్నకారు, మధ్య తరగతి రైతులకు ప్రయోజనం కలిగేలా రైతు భరోసాను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నదన్నారు. రోహిణి కార్తెలోనే పంటలకు పెట్టుబడి సాయం జమ చేయడంతో రైతులకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తనకు రెండున్నర ఎకరాల సాగు భూమి ఉన్నదని, 30 ఎకరాలు కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్నానని తెలిపారు. కౌలు రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పునరాలోచన చేస్తుందన్నారు. అంతకుముందు పలువురు రైతులు సాగుకు యోగ్యమైన భూమికి 10 ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలని, కౌలు రైతులకు కూడా అందించాలని కోరారు. సంఘం చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీసీఓ నాగమణి, అధికారులు, డైరెక్టర్లు కొణతం వరలక్ష్మి, శైలజారెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, యాదిగిరిరెడ్డి, సంతోష్‌రెడ్డి, మల్లయ్య, నాగయ్య, నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కుంభం



ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, జూలై 2 : పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని శివారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బొక్క అద్వత్‌రెడ్డి వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.50 లక్షల ఎల్ఓసీని హైదరాబాద్‌లోని తన నివాసంలో బాధితుడికి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులందరూ వినియోగించుకోవాలన్నారు. కాంగ్రెస్ నాయకులు ఉప్పునూతల వెంకటేశ్‌యాదవ్, చిలుకల సంతోష్‌యాదవ్, కోడిమాల మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి : శ్రీకాంత్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ శ్రీకాంత్

తుర్కపల్లి, జూలై 2 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రవేశపెట్టిన విధంగా జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ నల్ల శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి సంవత్సరంలోపు 2లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇస్తామని ఇప్పుడు విస్మరిస్తుందన్నారు. గ్రూప్1 మెయిన్స్‌కు ఒకటికి 100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని కోరారు. మెగా డీఎస్సీ వేసి టీచర్ పోస్టులను 25వేలకు పెంచాలని, నిరుద్యోగ భృతి రూ.4వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, లచ్చిరాం, మల్లేశ్, వెంకటయ్య, రమేశ్, రవి, రాజు, యాదగిరి పాల్గొన్నారు.

పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలి : సీపీఎం

సగంలో నిలిచిపోయిన పేదల ఇండ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

బొమ్మలరామారం, జూలై 2 : పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరి పాండు అన్నారు. మండలంలోని మర్యాల గ్రామంలో సర్వే నెం.455, 454లోని ప్రభుత్వ భూమిని, సగంలో నిలిచిపోయిన ఇండ్ల నిర్మాణాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పేదలకు ఇవ్వడానికి ఎకరానికి పైగా స్థలం ఉన్నా క